తొలగిన ఆటంకాలు


ప్రధాన రోడ్డుపై చెరువును తలపించేలా ఉన్న వరదనీరు(ఫైల్)

- రూ.14 కోట్ల టీయూఎఫ్‌ఐడీసీ నిధులకు టెండర్ పూర్తి
- వరదముంపు నివారణ పనులకు గ్రీన్ సిగ్నల్
- వారం రోజుల్లో శంకుస్థాపన
- పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌కు ఏర్పాట్లు

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటీలో ఓ మోస్తరు నుంచి చిన్నపాటి వర్షం వచ్చినా రోడ్లు జలమయంగా మారేవి. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందులు తొలగించేందుకు సమయం ఆసన్నమైంది. దీని కోసం చేపట్టిన వరదముంపు నివారణ పనులకు ఎట్టకేలకు ఆటంకాలు తొలగాయి. టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా మంజూరైన రూ.14కోట్లతో వరదనీటి కాల్వలు నిర్మించేందుకు ప్రణాళికలు రూపొందించారు. దీని కోసం ఏడాదిన్నర క్రితమే టెండరు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. ఈ నిధులతో మున్సిపాలిటీ పరిధిలో మొత్తం 10 కాల్వలు నిర్మించాల్సి ఉంది. టెండర్‌లో కేవలం ఒక్కరు మాత్రమే పాల్గొనటంతో ఈఎన్‌సీ అధికారులు కేటాయింపులు చేయలేదు. ఆ తరువాత ఎవల్యూషన్ చేసి ఇటీవల ప్రక్రియను పూర్తి చేశారు. ఈ తతంగం అంతా ఏడాదిపైగా సాగింది. తీరా ప్రక్రియ పూర్తయ్యాక వరసగా వర్షాలు పడుతుండటంతో పనులు ప్రారంభించేందుకు అవకాశం లేకుండా పోయింది. అక్టోబర్ 1న శంకుస్థాపన చేయటానికి ఏర్పాట్లు చేసినప్పటికీ మళ్లీ అవాంతరం ఏర్పడి వాయిదా పడింది. చివరకు అన్ని ఆటంకాలు తొలగటంతో ఈ నెలలో పనుల ప్రారంభించేందుకు ముహూర్తం ఖరారైంది.

పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన..

వరదనీటి కాల్వల నిర్మాణం (స్టామ్ వాటర్ డ్రెయిన్స్) శాశ్వత పరిష్కారం ఎలా చేయనున్నారో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మీడియాకు వివరించే యత్నాలు చేస్తున్నారు. అక్టోబర్ 1న పట్టణంలోని చంద్రగార్డెన్‌లో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి, ఇంజినీరింగ్ అధికారులు ఇందుకోసం ఏర్పాట్లు చేసినప్పటికి అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. ఈనెలలోనే చంద్రగార్డెన్‌లోనే పనులకు శంకుస్థాపన చేసి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ చేయనున్నారు.

నిర్మించనున్న కాల్వలు..

వరదముంపు నుంచి గట్టెక్కేందుకు మున్సిపాలిటీలోని పలు ప్రాంతాల్లో పెద్ద కాల్వలు, కల్వర్టులు నిర్మించనున్నారు. వాటిలో ప్రధానంగా నల్లకుంట నుంచి నాగర్‌కర్నూలు రోడ్డు మీదుగా అమర్‌కృష్ణ లాడ్జ్ పక్కనుంచి 4వ వార్డు వరకు పెద్ద కాల్వ నిర్మించనున్నారు. ఈ నిర్మాణంలో ప్రధానరోడ్డుపై కల్వర్టు సైతం నిర్మించాల్సి ఉంది. కావేరమ్మపేట రోడ్డులో ఉజ్జాబాయి యాదిరెడ్డి పొలం వద్ద కల్వర్టు పెద్దదిగా నిర్మాణం చేయనున్నారు. ఇక లక్ష్మీనగర్ కాలనీ–ఇందిరనగర్–వెంకటేశ్వర కాలనీలో మిగిలిపోయిన కాల్వ నిర్మిస్తున్నారు. ఊరకుంట నుంచి పద్మావతి కాలనీ నుంచి గౌడ ఫంక్షన్‌హాల్ కాల్వకు కనెక్టివిటి చేయనున్నారు. ఎర్రగుట్ట డబుల్‌బెడ్రూం వద్ద పెద్ద కాల్వ నిర్మిస్తున్నారు. శ్రీరాంనగర్ స్వదేశీ ఆయిల్‌మిల్ వద్ద మరో కాల్వ నిర్మిస్తున్నారు. శివాజీ నగర్‌లో కాల్వ చేపట్టనున్నారు. వాటితో పాటు మరికొన్ని కాల్వలు నిర్మిస్తున్నారు.


167వ నంబరు జాతీయ రహదారిపై శ్రీకృష్ణదేవాలయం ఎదురుగా నిలిచిన వర్షపునీరు

టెండరు ప్రక్రియ పూర్తి..

మున్సిపాలిటీ పరిధిలో వరదముంపు నీటిని ఎదుర్కొనేందుకు టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా విడుదలైన నిధులకు టెండరు ప్రక్రియ పూర్తయ్యింది. మొదటి విడతలో వచ్చిన రూ.14కోట్లతో దాదాపు 10 కాల్వలు, కల్వర్టులు నిర్మించేలా ప్రణాళికలు రూపొందించాం. ఇవి పూర్తయితే వరద ముంపు పూర్తిగా తొలగిపోయి ప్రజలకు ఉన్న ఇబ్బందులు తొలగిపోతాయి.

– లక్ష్మారెడ్డి, మున్సిపల్ కమిషనర్, జడ్చర్ల

వారంలో శంకుస్థాపన

వరద ముంపు నివారణ పనులకు ఈ వారంలోనే ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నారు. ఎమ్మెల్యే కృషివల్ల టెండరు ప్రక్రియలో ఉన్న ఆటంకాలు అన్ని తొలగిపోతాయి. 6న పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కాల్వల నిర్మాణం వల్ల జరిగే ప్రయోజనాలను మీడియాకు వివరిస్తారు. మరో రూ.3కోట్లు సైతం విడుదలయ్యాయి. వాటికి సైతం త్వరలోనే టెండరు ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నాం.

– కోనేటి పుష్పలత, చైర్‌పర్సన్,జడ్చర్ల మున్సిపాలిటీ

ప్రజల కష్టాలు తీర్చేందుకే..

ప్రజల కష్టాలు తీర్చేందుకు వరదనీటి కాల్వల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నాం. చిన్నవర్షం వచ్చినా రోడ్డుపై నీరు నిల్చి ఇబ్బందులు పడుతుండటం గమనించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకుంటున్నాం. టీయూఎఫ్‌ఐడీసీ ద్వారా రెండు విడతల్లో మొత్తం రూ.17కోట్లు విడుదల అయ్యాయి. మొదటి విడతలో రూ.14కోట్ల పనులు, రెండో విడతలో రూ.3కోట్ల పనులు చేస్తున్నాం. మొదటి విడత పనులకు శంకుస్థాపన చేయనున్నాం.

– జనంపల్లి అనిరుధ్‌రెడ్డి, ఎమ్మెల్యే, జడ్చర్ల

క్లుప్తంగా

పెండింగ్ బిల్లులు ఎప్పుడు విడుదల చేస్తారు?

స్టేషన్ మహబూబ్‌నగర్: ఉద్యోగస్తుల పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించిన డబ్బులు ఎప్పుడు విడుదల చేస్తారు అని ఆల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుఖ్ హుస్సేన్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల చెల్లింపుల కోసం నెలకు రూ.700 కోట్ల విడుదల చేస్తామని జేఏసీ నాయకులతో ఒప్పందాన్ని కుదుర్చుకొని ఇంత వరకు విడుదల చేయకపోవడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. రెండేళ్లుగా సరేండర్ లీవ్‌లు పెండింగ్‌లో ఉన్నాయని, జీపీఎఫ్ చివరి పేమెంట్స్ ఇంతవరకు చెల్లింపు జరగలేదని, టీఎస్‌జీఎల్‌ఐ ఎప్పుడు ఇస్తారో తెలియదన్నారు. కాని ఒప్పందాలు మాత్రం ప్రభుత్వం కదుర్చుకుందని, చెల్లింపులు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లుల ఆలస్యం వల్ల ఒక్కో ఉద్యోగి దాదాపు రూ.20వేలు ఆర్థికంగా నష్టపోతున్నట్లు తెలిపారు. వెంటనే సెప్టెంబర్ నెలకు సంబంధించి రూ.700 కోట్లు ఉద్యోగ, ఉపాధ్యాయుల బకాయిల చెల్లింపుల కోసం విడదల చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

సగరులు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి



జడ్చర్ల టౌన్: సగరులు స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని సగర సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రణీల్‌చందర్ పిలుపునిచ్చారు. ఆదివారం ప్రేరణ బ్రిలియంట్‌స్కూల్‌లో నిర్వహించిన సగర ఆత్మీయ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. సగరుల అభ్యున్నతికి ఐక్యంగా కృషి చేయాలని, అందుకోసం అందరం ఏకతాటిపైకి రావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో అవకాశం ఉన్న ప్రతిచోట పోటీచేసి విజయం సాధించేందుకు సగరులు కృషి చే యాలని, అందుకోసం ఇతర గ్రామాల్లో ఉన్న వారు అక్కడికి వెళ్లి సహకరించాలన్నారు. భగీరథుడి స్ఫూర్తిగా సగరులు అన్ని రంగాల్లో విజయం సాధించేందుకు పాటు పడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా వేముల మధుసాగర్, ప్రధాన కార్యదర్శి వావిలాల శంకర్, కోశాధికారి చంద్రశేఖర్‌లు ఎన్నికయ్యారు. సమావేశానికి సగరులు కుటుంబ సభ్యులతో కలిసి హాజరయ్యారు.

టికెట్ ఎవరికి వచ్చినా ఐక్యంగా పనిచేయాలి



మహమ్మదాబాద్: మండలంలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ టికెట్లు ఎవరికి వచ్చినా అందరం ఐక్యంగా పని చేసి గెలిపించుకోవాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కేఎం.నారాయణ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ ఎవరికి బీ ఫాం ఇచ్చినా ప్రతి కార్యకర్త కష్టపడి పని చేసి తమ అభ్యర్థులను గెలిపించుకోవాలన్నారు. ప్రజల కోసం పార్టీ చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ ఇ. రాములు, మాజీ ఎంపీపీ శాంతిరంగ్యా, మాజీ వైస్ ఎంపీపీ రాధారెడ్డి, డాక్టర్ బుచ్చిబాబు, రామ్‌లాల్, రాఘవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌పీఎల్ విజేత శివాజీ వారియర్స్



నవాబుపేట: మండల కేంద్రంలో వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్‌పీఎల్ సీజన్ 6 విజేతగా మండల కేంద్రానికి చెందిన శివాజీ వారియర్స్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆదివారం విజేతలకు నగదు బహుమతులు, విన్నర్ కప్‌లను అందించారు. మొదటి బహుమతి రూ.35 వేలు, విన్నర్‌కప్, ద్వితీయ బహుమతి రూ.15 వేలు, రన్నర్ కప్‌లు నిర్వాహకులు అందించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి, బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు శ్రీనివాస్, క్రికెట్ కౌన్సిల్ వీరేష్, గోపాల్, అజహర్, కేశవులు, నర్సింహులు, సత్యనారాయణ, రాహుల్, గిరి, మల్లేష్, శివ, సలావుద్దీన్ ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ సీజ్

నవాబుపేట: మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్ తెలిపారు. ఆదివారం కొండాపూర్ సమీపంలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు అక్కడికి వెళ్లి స్వాధీనం చేసుకున్నారు. డ్రైవర్ పరార్ కావడంతో ట్రాక్టర్ నంబర్ ఆధారంగా యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాధితులకు ఎమ్మెల్యే పరామర్శ



దేవరకద్ర: కౌకుంట్ల మండల కేంద్రంలో జర్నలిస్టు యాకుబ్ తల్లి ఇటీవల మరణించడంతో ఆదివారం ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి బాధితులను పరామర్శించారు. అనంతరం దేవరకద్రలోని కుర్వగొని శ్రీను తల్లి దశదిన కర్మ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. పలు కార్యక్రమాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే వెంట టీపీసీసీ కార్యదర్శి అరవింద్‌కుమార్‌రెడ్డి, దేవరకద్ర, కౌకుంట్ల మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లక్ష్మీకాంత్‌రెడ్డి, నాయకులు కిషన్ రావు, వెంకటేశ్, ఆంజనేయులు, వర్మ, రాంపాండు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల్లో విజయమే లక్ష్యం



దేవరకద్ర: స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలని మహబూబ్‌నగర్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి పిలుపు నిచ్చారు. ఆదివారం దేవరకద్రలోని ఆయన నివాసంలో నియోజకవర్గ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో పోటీ చేసిన అన్ని స్థానాలలో కనీసం 50 శాతం పైగా ఓట్లు వచ్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్‌రెడ్డి, బీజేపీ నాయకులు యజ్ఞభూపాల్‌రెడ్డి, గాల్‌రెడ్డి, భరత్‌భూషన్, నారాయణరెడ్డి, కుర్వ రమేశ్, కృష్ణంరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఏకగ్రీవం చేస్తే రూ.50 లక్షలు నజరానా

జడ్చర్ల: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా తనను ఏకగ్రీవం చేస్తే గ్రామాభివృద్ధికి రూ.50 లక్షలు నజరానా ఇస్తానంటూ ఓ వ్యక్తి ఆదివారం సోషల్ మీడియా వాట్సప్ గ్రూప్‌ల్లో హల్‌చల్ చేశాడు. మండలంలోని గంగాపూర్ గ్రామానికి చెందిన మన్నెం రఘురాంరెడ్డి పార్టీలకు అతీతంగా ఏకగ్రీవంగా తన అభ్యర్థిత్వాన్ని ఆమోదించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశాడు. సర్పంచ్ స్థానం జనరల్ కావడంతో తనకు అవకాశం ఇవ్వాలని ,రూ.50 లక్షలు గ్రామానికి సంబంధించి గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలో జమ చేస్తానని పేర్కొన్నాడు. నిబంధనల మేరకు ప్రభుత్వం విడుదల చేసే నిధలకు తన సొంత నిధులు జమ చేసి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతానని ఈ సందర్భంగా 'సాక్షి'కి వివరించాడు.

టెట్‌పై గందరగోళం తొలగించాలి

- టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి
- ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు చెల్లించాలి


మాట్లాడుతున్న టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: టెట్‌పై ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని తొలగించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి కోరారు. ఆదివారం జిల్లా కేంద్రంలో విలేకర్లతో ఆయన మాట్లాడుతూ టెట్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రివ్యూ పిటిషన్ వేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు పీఆర్‌సీ, రావాల్సిన డీఏలను వెంటనే విడుదల చేయాలన్నారు. సమగ్ర ఆరోగ్య విధానం రూపొందించి, హెల్త్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను త్వరగా చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శులు సింహాచలం, ఎం.వెంకటప్ప, జిల్లా అధ్యక్షుడు కె.రవికుమార్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అ'పూర్వ' సమ్మేళనం



నవాబుపేట: పూర్వ విద్యార్థుల సమ్మేళనం అపూర్వంగా సాగింది. సరిగ్గా 25 ఏళ్ల క్రితం ఒకే చోట చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం ఒక చోట కలిశారు. ఈ సందర్భంగా ఆదివారం మండలంలోని యన్మన్‌గండ్ల జెడ్పీ పాఠశాలకు చెందిన 2000 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు పాఠశాలలో సమ్మేళనం నిర్వహించారు. తమకు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకటయ్య, వీరేష్, రాము, రామకృష్ణారెడ్డి, అబ్దుల్‌కాశీం, రాజేందర్, గాయత్రి, శివలీల, జ్యోతి, ప్రసన్న, తదితరులు ఉన్నారు.

ఉద్యమంలా శాస్త్ర ప్రచారం


మాట్లాడుతున్న జేవీవీ రాష్ట్ర అధ్యక్షుడు చెలిమెల రాజేశ్వర్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: సూడో సైన్స్‌ను అడ్డుకునేందుకు శాస్త్ర ప్రచారాన్ని ఉద్యమంలా చేపట్టాల్సిన అవసరం ఉందని జన విజ్ఞాన వేదిక (జేవీవీ) రాష్ట్ర అధ్యక్షుడు చెలిమల రాజేశ్వర్ అన్నారు. ఆదివారం స్థానిక సుభాష్‌నగర్‌లోని ఓ ప్రైవేట్ స్కూల్‌లో సంఘం జిల్లా ప్లీనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో శాస్త్ర దృక్పథాన్ని కలిగించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం ఏర్పాటు చేయాలన్నారు. సీబీఎస్‌ఈ సిలబస్‌లో జీవపరిణామ సిద్ధాంతాన్ని, పీరియాడిక్ టేబుల్‌ను తొలగించరాదన్నారు. సంప్రదాయాలు పర్యావరణాన్ని రక్షించేలా ఉండాలన్నారు. సమావేశంలో జేవీవీ రాష్ట్ర కార్యదర్శి పి.వెంకటరమణ, జిల్లా అధ్యక్షుడు ప్రహ్లాదరెడ్డి, ప్రధాన కార్యదర్శి జి.వెంకటస్వామి, ప్రతినిధులు వేణుగోపాల్‌వర్మ, ఆర్.ప్రమోద్‌కుమార్, జి.సతీష్ కుమార్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

త్రైతసిద్ధాంత భగవద్గీత గ్రంథాల ప్రచారం

కొత్తకోట రూరల్: త్రైతసిద్ధాంత ప్రబోధ సేవాసమితి, ఇందూ జ్ఞానవేదిక మండల అధ్యక్షుడు విజయభాస్కర్ ఆధ్వర్యంలో ఆదివారం పెద్దమందడి మండలంలోని మణిగిల్ల గ్రామంలో ప్రబోధనంద యోగీశ్వరులు రచించిన త్రైతసిద్ధాంత గ్రంథాల పరిచయ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీకృష్ణుడే జగద్గురువని, జ్ఞానం బోధించే వారిని గురువులు అంటారన్నారు. 'దశ' అంటే పది అని, 'ర' అంటే నశింపజేయడమని ఐదు కర్మేంద్రియాలను ఐదు జ్ఞానేంద్రియాలను యోగ మార్గంలో నశింపజేయడం అంటే మొత్తం పది ఇంద్రియాలను జయించజేయడమే దసరా పండగ యొక్క అర్థమన్నారు. కార్యక్రమంలో పురుషోత్తం, మాసన్న, వేణుగోపాల్, బాలకృష్ణ, శివ, జాంగీర్, అనిత, శాంత, శైలజ, జ్యోతి, ప్రమీల, మంజుల ఉన్నారు.

దర్గాలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యే పూజలు


భూత్పూర్‌లో దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి


భూత్పూర్‌లో దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్: పట్టణంలోని మహబూబ్ సుబానీ దర్గాలో ఆదివారం దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముస్లింలకు గ్యార్మీ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రిటైర్డ్ ఏఎస్‌ఐ మహ్మద్ సాదిక్ ఉమ్ర యాత్రకు వెళ్తున్న సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శాలువా, పూలదండతో సత్కరించారు. శనివారం రాత్రి హజ్రత్ మహబూబ్ సుబానీ గ్యార్మీ సందర్భంగా ముస్లింలు, నిర్వాహకులు ఇంటి నుంచి గంధం, జెండా పట్టణ పుర వీధుల గుండా తీసుకెళ్లారు. దర్గా వద్ద ఫాతెహాలు ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి వెంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్, నాయకులు లిక్కి విజయ్‌గౌడ్, మైనార్టీ సెల్ పట్టణ అధ్యక్షుడు జమీర్, మాజీ ఎమ్మెల్యే వెంట నాయకులు సత్యనారాయణ, మున్సిపల్ మాజీ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ఖదీర్, అఫ్సర్, మహ్మద్ అహ్మద్, తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోడ్‌తో ఉచిత భోజనానికి బ్రేక్

నవాబుపేట: సంతలో ప్రతి ఆదివారం అందించే ఉచిత భోజన కార్యక్రమానికి ఎన్నికల కోడ్ అడ్డు వచ్చింది. దీంతో ఏడాది పాటు కొనసాగిన కార్యక్రమానికి బ్రేక్ పడింది. ఆదివారం జిల్లా ఎన్నికల అధికారి ఉచిత భోజన కార్యక్రమం నిర్వహించే దాతకు ఈ కార్యక్రమాన్ని నిలిపి వేయాలని సూచించినట్లు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నర్సింహాచారి తెలిపారు. దీంతో సంతకు వచ్చే వారికి అందించే ఉచిత భోజనం ఎన్నికల కోడ్ ముగిసే వరకు నిర్వహించటం కుదరదని, దీన్ని అందరు గమనించాలని ఆయ న సోషల్ మీడియా ఖాతాలో పోస్టు చేశాడు. ఆదివారం సంతకు వచ్చిన ప్రజలకు ఉచిత భోజనానికి అధికారులు అడ్డు చెప్పటం సమంజసం కాదని వాపోయారు.

ఇసుక డంపు సీజ్



మిడ్జిల్: మండల కేంద్రం సమీపంలో కొత్తూర్ దగ్గర అక్రమంగా డంపు చేసిన ఇసుక డంపును సీజ్ చేసినట్లు ఎస్‌ఐ శివనాగేశ్వర్ నాయుడు తె లిపారు. ఆదివారం నిబంధనలకు విరుద్ధంగా ఇసుకను డంపు చేసిన వారిపై చర్యలు ఉంటా యని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులతో కలిసి ఇసుకను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



దామరగిద్ద: బాల్య వివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకరించాలని విజన్ సంస్థ కోఆర్డినేటర్ స్వప్న, శైలజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని సంజీవరాయ ఆలయ ఆవరణలో బాల్యవివాహాల నివారణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించి అనంతరం మాట్లాడారు. ప్రతి ఒక్కరు బాధ్యతగా వ్యవహరించి మండలాన్ని బాల్యవివాహాల రహితంగా మార్చాలని కోరారు. ఎక్కడైనా బాల్య వివాహం చేస్తే 1098 ద్వారా లేదా 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్‌ఎంపీ వైద్యుడు వెంకట్రాములు పాల్గొన్నారు.

నేడు పీఓ, ఏపీఓలకు శిక్షణ

పాన్‌గల్: సాధారణ ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన పీఓ, ఏపీఓలకు సోమవారం రోజు మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ గోవింద్‌రావు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

గ్రూప్‌-1లో ఉద్యోగం సాధించిన మిత్రుడికి సన్మానం



దేవరకద్ర: ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన గ్రూప్‌–1లో విజయం సాధించి మున్సిపల్ కమిషనర్ ఉద్యోగానికి ఎంపికైన దేవరకద్రకు చెందిన పడమటి వెంకటేశ్వర్‌రెడ్డిని తోటి స్నేహితులు ఆదివారం ఘనంగా సన్మానించారు. ఆయన నివాసానికి వెళ్లిన శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఇంకా ఉన్నత స్థానానికి చేరుకోవాలని స్నేహితులు కోరారు.

సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్లు



స్టేషన్ మహబూబ్‌నగర్: మహబూబ్‌నగర్ డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా వెంకటేశ్వర్లు బదిలీపై వచ్చారు. ఇక్కడ సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న విజయజ్యోతి ఆర్‌ఎంఎస్‌జెడ్ డివిజన్‌కు బదిలీపై వెళ్లారు. ఆమె స్థానంలో సూర్యాపేట డివిజన్ నుంచి బదిలీపై వెంకటేశ్వర్లు మహబూబ్‌నగర్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు.

ఎమ్మెల్యే వాహనాన్ని ఢీకొట్టిన బైక్



మిడ్జిల్: జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి వాహనాన్ని బైక్ ఢీకొట్టిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. పూర్తి వివరాలు.. మండల పరిధిలోని వాడ్యాల్ సమీపంలో ఉన్న ఓ ఫంక్షన్‌హాల్‌లో శుభకార్యానికి హాజరైన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి తన వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి వేడుకలో పాల్గొన్నారు. ఈ క్రమంలో ఆగిఉన్న ఎమ్మెల్యే వాహనాన్ని బైక్ ఢీకొట్టింది. ప్రమాదం సమయంలో ఎవరూ లేకపోవటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వాహనం ధ్వంసం కావడంతో ఎమ్మెల్యే వేరే వాహనంలో హైదరాబాద్‌కు వెళ్లారు.

కనుల పండువగా శ్రీనివాస కల్యాణం

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని శ్రీ తీర్థం వెంకటేశ్వర స్వామి దేవాలయం ద్వితీయ వార్షికోత్సవ వేడుకలలో భాగంగా ఆదివారం శ్రీనివాస కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మీ శోభన భజన మండలి సభ్యుల ఆధ్వర్యంలో స్వామివారి భక్తి గీతాలాపన చేశారు. హనుమాన్ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేనేజర్ హరీషా చారీ, అర్చకులు కోప్రేష్ చారీ, డాక్టర్ అనీరుధ్ చారీ, రఘుప్రేమ్ తీర్థాచార్యులు, గోపినాథ్, మద్యేశ్ ఆచార్యులు, రవీంద్ర చారీ, దీపక్ పాల్గొన్నారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


పిరమిడ్ మాస్టర్లతో రవిప్రకాశ్

హన్వాడ: శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ రవిప్రకాశ్ అన్నారు. ఆదివారం మండలంలోని దాచక్‌పల్లిలో పిరమిడ్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రతిఒక్కరు ధ్యాన సాధన చేయాలన్నారు. నిత్య జీవితంలో ఒత్తిళ్లను జయించేందుకు ధ్యానం తప్పనిసరి అని పేర్కొన్నారు. ధ్యానంతో బుద్ధి వికసిస్తుందని, మానసిక ప్రశాంతత కలుగుతుందని వివరించారు. ప్రతిఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడవాలన్నారు. ప్రకృతికి విరుద్ధంగా ఎవరు ప్రవర్తించొద్దన్నారు. అనంతరం మాస్టర్లకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్లు, మహిళలు, చిన్నారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.